క్లుప్తంగా

వేమలిలో వైద్యశిబిరం



వైద్యసేవలందిస్తున్న డాక్టర్ పుష్పాంజలి

గజపతినగరం: మండలంలోని వేమలి గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పుష్పాంజలి ఆధ్వర్యంలో బుధ వారం వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 52మందికి వైద్యాధికారితో పాటు వైద్యసిబ్బంది వివిధ పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

మార్చి 8న జాతీయ మెగాలోక్ అదాలత్



మాట్లాడుతున్న న్యాయమూర్తి కనకలక్ష్మి

గజపతినగరం: స్థానిక ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ కోర్టులో మార్చి 8వ తేదీన నిర్వహించనున్న జాతీయ మెగాలోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జూని యర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి కోరారు. స్థానిక కోర్టులో న్యాయవాదులతో బుధవారం సమీక్ష జరిపారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ కేసుల సత్వర న్యాయానికి లోక్‌అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. సివిల్, క్రిమినల్, తదితర కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకోవచ్చని, ప్రతీ న్యాయవాది తమపరిధిలో ఉన్న కక్షిదారులను పిలిచి వారితో మాట్లాడి లోక్‌అదాలత్‌లో రాజీమార్గంలో కేసులుపరిష్కరించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు.

అభివృద్ధికి పాటుపడండి



రికార్డులు తనిఖీ చేస్తున్న సీఈఓ సత్యనారాయణ

గంట్యాడ: అధికారులంతా సమన్వయంతో పనిచేసి మండలాభివృద్ధికి పాటుపడాలని జిల్లా పరిషత్ సీఈఓ బి.సత్యనారాయణ సూచించారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం తనిఖీలు చేశారు.సిబ్బంది హాజరు, వివిధ పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని, ప్రజల నుంచి వినతుల కు తక్షణం స్పందించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.ఆయన వెంట ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి, ఏఓ రాములమ్మ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చీపురుపల్లి: విజయవాడలో ఈనెల 26న నిర్వహించిన రాష్ట్రస్థాయి 76వ రిపబ్లిక్ డే వేడుకల పరేడ్‌లో మెట్ట పల్లి ఉన్నత పాఠశాల నుంచి స్కౌట్స్ ,గైడ్స్ విభాగంలో విద్యార్థులు ఎల్.దరహాసిని, డి.ద్రాక్షాయని, ఎల్.గౌరి, ఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. వీరిని ఇన్‌చార్జి హెచ్‌ఎం తేజశ్వని, స్కౌట్స్, గైడ్స్ మాస్టర్స్ బి.సతీష్, ఎస్.కనకమహాలక్ష్మి, ఉపాధ్యాయులు ఎం.సుశీల, రామ్మోహనరావు తదితరులు బుధవారం అభినందించారు.

ఉత్తమ సర్పంచ్‌కు సన్మానం



సర్పంచ్ కృష్ణను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

కొత్తవలస: జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింట కుళాయిల నిర్వహణలో కాటికాపల్లి సర్పంచ్ పీతల కృష్ణ ఉత్తమ సర్పంచ్‌గా ఎంపికయ్యారు. ఉత్తమ సర్పంచ్‌లకు ఢిల్లీలో జాతీయస్థాయిలో నిర్వహించిన రిపబ్లిక్‌డే వేడుకలకు రాష్ట్రపతి కార్యాలయం నుంచి ఆహ్వానం అందింది. ఈ మేరకు ఈనెల 26న నిర్వహించిన వేడుకులకు ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సమక్షంలో మండల ప్రజాప్రతినిధులు బుధవారం ఆయన్ని సన్మానించారు. ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ, మాజీ ఎంపీపీ గౌరపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

సూచనలు పాటించాలి

దత్తిరాజేరు: పంటల సాగులో రైతులు వ్యవసాయ సిబ్బంది సూచనలు, సలహాలను పాటించాలని ఏఓ అనురాధ అన్నారు. మండలంలో కె.కృష్ణాపురం,చౌదంతివలస గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. చౌదంతివలసలో వేరుశనగ పంటను పరిశీలించారు.పంట పూతదశలో ఉన్నప్పుడు ఎకరానికి 200 కిలోల జిప్సం వేసి గొప్పు తవ్వాలని, కలుపు తీయడం వల్ల కాయ బరువు పెరిగి ఎక్కువ శాతం నూనె దిగుబడి వస్తుందని అన్నారు.

సహాయం స్ఫూర్తిదాయకం

- సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు
- పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి చేయూత
- ఆపదలో ఉన్న వారి ప్రాణాలు నిలబెట్టేందుకు రక్తదాన శిబిరాల నిర్వహణ
- 1,893 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు



చిన్నారి వైద్యఖర్చులకు ఆర్థిక సాయం చేస్తున్న సంస్థ సభ్యులు (ఫైల్)



దత్తిరాజేరు మండలంలోని ఎస్టీ కొత్తవలస గ్రామస్తులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న సంస్థ సభ్యులు (ఫైల్)



బొండపల్లి మండలంలోని గొట్లాం వద్ద అనాథ ఆశ్రమంలో పిల్లలకు స్వెటర్ల పంపిణీ (ఫైల్)

దత్తిరాజేరు: మానవ సేవే మాధవ సేవని..కష్టాల్లో ఉన్న వారికి సహాయం చేయడంలోనే నిజమైన సంతృప్తి, ఆనందం ఉందని భావించి యుక్త వయస్సులోనే సామాజిక సేవ బాటపట్టాడు మండలంలోని పోరలి గ్రామానికి చెందిన వై.వి.సాయికుమార్. ఎంటెక్ పూర్తి చేసి, తండ్రి ఏర్పాటు చేసిన మెడికల్ షాపును చూసుకుంటూనే 2016లో 'సహాయ స్ఫూర్తి ఫౌండేషన్' ఏర్పాటు చేసి సేవాకార్యక్రమాలు ప్రారం భించారు. తొలుత అయిదుగురు సభ్యులతో నడిచిన ఈస్వచ్ఛం ద సంస్థలో ప్రస్తుతం 1200 మందికిపైగా సభ్యులు భాగస్వాములయ్యారు. సంస్థ సేవలను జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించారు. సంస్థ సేవలకు ప్రముఖుల ప్రశంసలతో పాటు అవార్డులు కూడా దక్కాయి.

విద్యాభివృద్ధికి కృషి

పేదరికం చదువుకి అడ్డంకి కాకుడదని, పేద పిల్లల చదువుకి వీలైనంతలో సహాయ పడాలన్నది సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ లక్ష్యాల్లో ఒకటి అని ఆసంస్థ సభ్యు లు చెబుతున్నారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్యాగులు, నోట్ పుస్తకాలు, పెన్నులు, ఇతర విద్యా సామగ్రి, దుస్తులు, కాలినడ కన ఇతర గ్రామాల్లోని పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్నారు. అనాథ, వృద్ధాశ్రమాలకు నిత్యావసర సరుకులు అందించడం, భోజనాలు ఏర్పా టు చేయడం చేస్తున్నారు. కోవిడ్ సమయంలో ప్రజలకు ఐసోలేషన్ కిట్లు, మాస్కులు, మందులు పంపిణీ చేసి జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా కరోనా వారియర్,లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. ఉత్తమ సేవలు అందించే వైద్యులకు డాక్టర్స్‌డే రోజులున సన్మానాలు చేయడం, దాతల సహకారంతో గ్రామాల్లో సోలార్ వీధి లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్క లు నాటే కార్యక్రమాలు చేపడుతున్నారు. విజయవాడలో ఇటీవల వరదల వల్ల నష్టపోయిన ప్రజలకు నిత్యావసరాలు, దుస్తులు, పిల్లలకు విద్యా సామగ్రి అందజేశారు. సేవా కార్యక్రమాలతో పాటు ప్రజాసమస్యలను పాలకుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి తమవంతు కృషి చేస్తున్నారు.

100కి పైగా రక్తదాన శిబిరాలు

రోడ్డు ప్రమాదాల్లో గాయపడి అత్యవసరంగా రక్తం కావాల్సిన వారికి, శస్త్రచికిత్సల సమయంలో రక్తం అవసరమైన వారికి సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. రక్తం అవసరమైన వారు సంస్థను సంప్రదిస్తే సంస్థలోని సభ్యులు నేరుగా ఆస్పత్రులకు వెళ్లి రక్తదానం చేస్తున్నారు. సంస్థ సభ్యులు రక్తదానం చేయడమే కాకుండా సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు గజపతినగరం నియోజకవర్గంలో వందకుపైగా రక్తదాన శిబిరాలు నిర్వహించి దాతల నుంచి రక్తం సేకరించి ఆస్పత్రులు, బ్లడ్ బ్యాంకులకు అందజేశారు. అలాగే 112 నేత్రవైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వేలాదిమంది ప్రజల కు ఉచితంగా నేత్ర పరీక్షలు చేయించారు. అవసరమైన వారికి మందులు అందజేయడంతో పాటు 1893 మందికి కంటి ఆపరేషన్‌లు చేయించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేని పేద పిల్లలకు తమవంతు ఆర్థిక సహాయం అందిస్తూ ప్రాణం పోస్తున్నారు.



రక్తదానం చేస్తున్న సంస్థ సభ్యులు

ఆనందంగా ఉంది



పేదలకు తమవంతు సహాయం చేయడం ఆనందంగా ఉంది. తొలుత సంస్థలో నాతో పాటు మరో అయిదుగురు స్నేహితులు ఉండేవారు. చిన్నచిన్న సేవా కార్యక్రమాలు చేసేవారం. సంస్థలో ప్రస్తుతం 1,200 మంది సభ్యులున్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా సహాయం చేసే స్థాయికి సంస్థ ఎదిగింది.

– వై.వి.సాయికుమార్, సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు

కలిసికట్టుగా ముందుకు..



ఎవరైనా కష్టాల్లో ఉన్నారని తెలిస్తే సంస్థ సభ్యులమంతా కలిసికట్టుగా వారికి చేతనైన సహాయం అందిస్తున్నాం. ఆపదలో ఉన్న వారికి రక్తం అవసరమైతే సంస్థ సభ్యులు ఆస్పత్రులకు వెళ్లి రక్తం అందిస్తున్నారు. నేత్ర, వైద్య శిబిరాల నిర్వహణతో పేదలకు వైద్యసేవలు గ్రామాల్లో అందేలా చూస్తున్నాం. పేద పిల్లల చదువులకు తోడ్పాటు అందిస్తున్నాం. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతాం.

– ఎం. సాయిరేవంత్, సహయ స్ఫూర్తి ఫౌండేషన్ కార్యదర్శి

వైభవంగా గ్రామదేవతల తీర్థం



పోటీల్లో పరుగుతీస్తున్న ఎడ్లు



మహిళలు వేసిన ముగ్గులను తిలకిస్తున్న న్యాయ నిర్ణేతలు

వేపాడ: మండల కేంద్రంలో గ్రామదేవతలు పరదేశమ్మ, ముత్యాలమ్మ తల్లి తీర్థమహోత్సవం బుధ వారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూ జలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా నిర్వాహకులు ముగ్గులు, ఎడ్ల పరుగు పోటీలు ఏర్పాటు చేశారు. ముగ్గుల పోటీల్లో 32 మంది మహిళలు పాల్గొనగా విజేతలకు బహుమతులు, పోటీల్లో పాల్గొన్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఎడ్ల పరుగు పోటీల్లో 13 జతల ఎడ్లు పాల్గొన్నాయి. వీటిలో మొదటి అయిదు స్థానాల్లో నిలిచిన ఎడ్లకు సంబంధించిన యజమానులకు నగదు బహుమతి అందజేశారు.అలాగే గ్రామంలోని అయిదుగురి పారిశుద్ధ్య కార్మికులను గోకేడ సూరి బాబు కుటుంబీకులు సన్మానించారు.

ఒత్తిడిని అధిగమిస్తే అద్భుత ఫలితాలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సైకాలజిస్ట్ డాక్టర్ కృష్ణారావు

చీపురుపల్లి: పబ్లిక్ పరీక్షలు అనగానే చాలామంది విద్యార్థులు అనవసరమైన భయంతో ఒత్తిడికి గురవుతారని, ఒత్తిడిని అధిగమించినప్పుడే అద్భుత ఫలితాలు సాధించగలుగు తారని అడ్వాన్స్‌డ్ సైకాలజీ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీఏ) సైకాలజిస్ట్ డాక్టర్ మిరియాల కృష్ణారావు అన్నారు. పట్టణంలోని శ్రీనివాస జూనియర్ కళాశాలలో ఆ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం 'విజయీభవ' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలంటే భయాన్ని వీడాలని సూచించారు. శతశాతం మార్కులు సాధించాలంటే ప్రణాళిక చాలా ముఖ్యమని చెప్పారు. ఏడాది కాలంగా తరగతి గదుల్లో బోధించిన పాఠ్యాంశాలు మాత్రమే పరీక్షల్లో ప్రశ్నలుగా వస్తాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రణాళికా బద్ధంగా సాధన చేస్తే చక్కని ఫలితాలు సాధించగలరని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ ఏ.డి.ఎన్.ఎస్.వి.ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో జీవితాలు నాశనం



మాట్లాడుతున్న డీ రాఘవులు

చీపురుపల్లి: గంజాయి వినియోగించినా, రవాణా చేసినా, వ్యాపారం చేసిన వారి జీవితాలు నాశనమవ్వడం ఖాయమని డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలు, సైబర్ నేరాలపై పట్టణంలోని గాయత్రీ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పెద్ద పట్టణాల్లో ఉండే గంజాయి ఇప్పుడు చిన్న పట్టణాలకు సైతం విస్తరించిందన్నారు. విద్యార్థులు, యువత గంజాయి, డ్రగ్స్ జోలికి పోయి భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు. ఎవరైనా గంజాయి పీల్చుతున్నట్లు తెలిసినా, రవాణా చేస్తున్నట్లు గమనించినా తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను చదివిస్తున్నారని వారి కష్టాన్ని గుర్తించి చక్కగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని జాగ్రత్తలు పాటించాలన్నారు. సీ.శంకరరావు, ఎస్ఐ ఎల్.దామోదరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డి.శివప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలకు అధ్యక్షుల నియామకం

దత్తిరాజేరు: గజపతినగరం నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

విభాగం	అధ్యక్షుడు
యూత్ వింగ్	కె.పైడిపునాయుడు
మహిళా విభాగం	రెడ్డి పద్మావతి
రైతు విభాగం	ఈదుబిల్లి కృష్ణ
బీసీ సెల్	లచ్చిరెడ్డి కృష్ణ
ఎస్సీ సెల్	జి.ఈశ్వరరావు
ఎస్టీ సెల్	ఎస్.సత్యారావు
మైనార్టీసెల్	షేక్ కబీర్
క్రిస్టియన్ సెల్	కె.విక్టర్‌పాల్
స్టూడెంట్ సెల్	మీసాల గణేష్
పంచాయతీరాజ్	ఈదుబిల్లి రమేష్
ఆర్టీఐ	శీర రమణ
వలంటీర్ వింగ్	కె.సుబ్రహ్మణ్యం
గ్రీవెన్స్	మహంతి రమణ
వాణిజ్యం	తుమ్మలగుంటి సూర్యనారాయణ
వీవర్స్ వింగ్	వి.యు.ఎం. శ్రీనివాసరావు
టీయూసీ	కె.సీతారాం
అంగన్‌వాడీ	జె.వెంకటలక్ష్మి
లీగల్ సెల్	కంది తిరుపతినాయుడు
కల్చరల్ వింగ్	కరక దశరథ్
సోషల్ మీడియా	పి.నారాయణమూర్తి
ఐటీ వింగ్	సిడగ రాజు
దివ్యాంగుల విభాగం	డి.గణపతి
డాక్టర్స్ వింగ్	డాక్టర్ వి.వి.ఎస్. అప్పలనాయుడు
ఇంటలెక్చువల్ ఫోరం	సీహెచ్.సూర్యారావు
బూత్ కమిటీలు	ఎం.ఫణీంద్రుడు
పబ్లిసిటీ వింగ్	మిత్తిరెడ్డి రమేష్‌నాయుడు

వ్యాసరచన పోటీలు



బహుమతులు అందజేస్తున్న పశువైద్యాధికారి గాయత్రి


లక్కవరపుకోట: జంతు సంక్షేమ పక్షోత్సవాల సందర్భంగా స్థానిక కేజీబీవీలో విద్యార్థినులకు పశువైద్యాధికారి కె.గాయత్రి ఆధ్వర్యంలో జంతు సంరక్షణ చట్టాలపై బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ జంతువులను హింసించడం, గాయ పరచడం, ఎక్కువ బరువులు లాగించడం, ముసలి, జబ్బుపడిన పశువులతో పనిచేయించడం చట్టరీత్యా నేరమన్నారు. కేజీబీవీ ఎస్ఓ బి.ప్రవీణ, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

రైతు భరోసా ఎప్పుడిస్తారు...?

- మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన సభ్యులు
- ప్రజా ప్రతినిధులకు గౌరవం ఇవ్వడం లేదని ఆవేదన
- రాజకీయనాయకుడిలా మాట్లాడవద్దంటూ తహసీల్దార్‌పై ఎమ్మెల్సీ ఆగ్రహం



అధికారులను నిలదీస్తున్న ఎంపీటీసీ పరదేశినాయుడు



మాట్లాడుతున్న ఎంపీపీ గోపమ్మ, ఎమ్మెల్సీ రఘురాజు

కొత్తవలస: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా నేటికీ అన్నదాతలకు రైతు భరోసా సహాయం అందలేదని, ఎప్పుడు ఇస్తారో చెప్పాలని మండల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు అధికారులను నిలదీశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ అధ్యక్షతన, ఎంపీడీఓ రమణయ్య ఆధ్వ ర్యంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభకు అతిథిగా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు హాజరయ్యారు.ముందుగా అధికారులు తమ శాఖల వారీగా ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు మాధురీశరణ్య, పప్పు పద్మ తమ శాఖల గురించి వివరిస్తుండగా... కాటికాప ల్లి ఎంపీటీసీ సభ్యుడు పరదేశినాయుడు, అప్పన్నపాలెం సర్పంచ్ కోన దేముడు అడ్డుతగిలారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుభరోసా సాయాన్ని పెంచి అన్నదాత సుఖీభవ పేరుతో అమలు చేస్తామని ఎన్నికల్లో చంద్రబాబునాయుడు, కూటమి నాయకులు హామీ ఇచ్చారని, పథకాన్ని ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టత ఇవ్వాలని అధికారుల ను ప్రశ్నించారు.సంబంధిత అధికారులు స్పందిస్తూ పథకం అమలుపై తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని బదులిచ్చారు. పలు గ్రామా ల సర్పంచ్‌లు మాట్లాడుతూ అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని, సర్పంచ్‌లను పక్కన పెట్టి అధికార పార్టీ నాయకులతో గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో పనులు చేయిస్తున్నారని, స్థానిక ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

తహసీల్దార్ తీరుపై ఆగ్రహం

సభలో రెవెన్యూ శాఖపై చర్చిస్తున్న సమయంలో రీసర్వే అంశం ప్రస్తావనకు వచ్చింది. తహసీల్దార్ నీలకంఠరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వేలో అంతా తప్పులు జరిగాయని, వాటిని సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. తహసీ ల్దార్ మాట్లాడిన తీరుపై ఎమ్మెల్సీ రఘురాజు తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో సర్వే చేసింది మీరే కదా అప్పుడు తెలి యలేదా తప్పులు చేస్తున్నట్లు అంటూ నిలదీశారు. మీకు ప్రస్తుత ప్రభుత్వంపై మోజు ఉంటే మరోవిధంగా చూపించుకోండి.. అంతేకాని రాజకీయనాయకుడిలా మాట్లాడడం తగదని సూచించారు. గత ప్రభుత్వంలో ఎంపీటీసీ, సర్పంచ్‌లతో కలిసి తాము సుమారు మూడున్నర సంవత్సరాలు పని చేశామని, అంటే అప్పట్లో మేము చేసిన పనులన్నీ తప్పులే అంటారా అంటూ ప్రశ్నించారు. తహసీ ల్దార్ తీరుపై పలువురు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

• స్టడీమెటీరియల్ పంపిణీ



పెదబంటుపల్లి ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న 60 మంది విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన బాలమిత్ర ఫౌండేషన్ సమకూర్చిన స్టడీమెటీరియల్‌ను హెచ్‌ఎం ఎస్.శ్రీనివాసరావు బుధవారం పంపిణీ చేశారు. బాలమిత్ర ఫౌండేషన్ ప్రతినిధులకు హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. సీఆర్‌ఎంటీ ఆర్.శంకరరావు పాల్గొన్నారు. –గుర్ల

• కషాయాలతో చీడపీడల నివారణ



పంటలను ఆశించే తెగుళ్లను కషాయాలతో నివారించవచ్చని, ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ సూర్యకుమారి, భీమ వరం యూనిట్ ఇన్‌చార్జి బొత్స శంకర్ అన్నారు. ఎం.రావివలసలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు ఫలపత్ర ద్రావణం, వివిధ కషాయాల తయారీపై బుధవారం అవగాహన కల్పించారు. పంటలకు రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువులు, కషాయాలు, ఘన, ద్రవ,జీవామృతాలను వినియోగించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు. –మెరకముడిదాం

• రాష్ట్రపతికి లేఖలు



అంగన్‌వాడీ కార్యకర్తలను గ్రేడ్–3, ఆయాలను గ్రేడ్–4 ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరణ చేయాలని కోరుతూ కోటగండ్రేడు సెక్టార్ పరిధి అంగన్‌వాడీ సిబ్బంది రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు బుధ వారం లేఖలు రాశారు. గుజరాత్ హైకోర్టుతో పాటు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని, 7వపే కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా కనీస వేతనం రూ. 26 వేలు అందించాలని, వడ్డీతో సహా గ్రాట్యుటీ చెల్లించాలని లేఖలో పేర్కొన్నారు. –గుర్ల

శతశాతం అక్షరాస్యతే లక్ష్యం



మాట్లాడుతున్నవయోజన విద్యాశాఖ డీడీ సోమేష్

గంట్యాడ: వయోజనుల్లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్ది శతశాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా పని చేయాలని వీఓఏలను వయోజన విద్యాశాఖ డీడీ సోమేష్ కోరారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక వెలుగు కార్యాలయంలో వీఓఏలకు బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లో మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దితే , సంఘాలు మరింత ప్రగతి సాధిస్తాయన్నారు. ఏపీఓ లక్ష్మి, ఎంఆర్‌పీ హరిష్, ఏపీఎం కె. సులోచనాదేవి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు



అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ ఆనందరావు

వేపాడ: పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయమే అన్ని విధాలా మేలని ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ ఆనంద రావు అన్నారు. బొద్దాం, వీలుపర్తి గ్రామాల్లో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై బుధవారం అవగాహన కల్పిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని, ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులను పొందవచ్చన్నారు.మార్కెట్‌లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందన్నారు. పంటలను ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణకు వినియోగించాల్సిన కషాయాల తయారీ విధానాన్ని వివరించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు శానాపతి లీలా, ఎర్రా రామసత్యవతి, ఎంపీటీసీ పి.లక్ష్మి, కో–ఆర్డినేటర్ వెంకటరావు, ఏఈఓ వరప్రసాద్, ఏటీఎల్ వసంత పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

గజపతినగరం: పంటల సాగులో అధిగ బడులు సాధించేందుకు మేలైన యాజమాన్య పద్ధతులు, సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ ధనలక్ష్మి చెప్పారు. మండలంలోని కెంగువ, ముచ్చర్ల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో మొక్కజొన్న పంటను పరిశీలించి, రైతులకు ఎరువుల యాజమాన్యం, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వీఏఏలు శైలజ,సన్యాసిరావు పాల్గొన్నారు.